సాక్షి ఒడిశా

గురువారం । 24 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,09,683
బంగారం	8 గ్రాముల 200 మిల్లీ గ్రాములు
వెండి	24 గ్రాముల 530 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

సేవ ముసుగులో వసూళ్లు



మల్కన్‌గిరి జిల్లాలోని కలిమెల సమితికి చెందిన మా ఘర్ సురక్ష సేన్ అధ్యక్షురాలు ప్రశాంతి లతా బిసాయి పలువురి కుటుంబ సమస్యలు పరిష్కరిస్తానని నమ్మబలుకుతూ డబ్బులు వసూలు చేస్తోంది. దీంతో ఆమెను తపస్ భోం అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్టు చేశారు.

- IIలో



మౌలిక వసతులకు ప్రాధాన్యమివ్వాలి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి సూచించారు. ఈ మేరకు రాయగడ సమితి కార్యాలయం సద్భావనా హాల్‌లో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు.

- IIలో

న్యూస్‌రీల్



శభాష్.. ఆర్పీఎఫ్

స్థానిక రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) స్టేషను పోస్ట్ డ్యూటీ సిబ్బంది సమయస్ఫూర్తి, అప్రమత్తతతో ప్రయాణికుని అమూల్యమైన ప్రాణాలు దక్కాయి. ఆపరేషన్ జీవన్ రక్ష కార్యక్రమం విజయవంతం చేయడంలో విధి నిర్వహణలోని సిబ్బంది అద్భుతమైన సేవలందించారు. వివరాల్లోకి వెళ్తే.. రైల్వేస్టేషన్‌లో బుధవారం 12841 నంబర్ గల హౌరా–చెన్నై కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కబోయి ఒక ప్రయాణికుడు జారిపడ్డాడు. వెంటనే విధి నిర్వహణలో ఉన్న రైల్వే రక్షక దళం సిబ్బంది గుర్తించారు. సమయస్ఫూర్తితో స్పందించి పట్టాలపైకి జారిపోతున్న ప్రయాణికుని ఆదుకుని సురక్షితంగా ప్లాట్‌ఫారం పైకి లాగారు. దీంతో 63 ఏళ్ల వృద్ధుడి ప్రాణాలను కాపాడారు. అనంతరం చికిత్స కోసం స్థానిక క్యాపిటల్ ఆస్పత్రికి తరలించారు.

– భువనేశ్వర్

82 కిలోల గంజాయి పట్టివేత



కారుతో పాటు అరెస్టు చేసిన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలోకి రవాణా అవుతున్న 82 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని దిగపండి నుంచి బరంపురం వైపు వస్తున్న ఒక కారులో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు పోలీసులకు ముందస్తుగా సమాచారం అందింది. దీంతో హింజికాట్–దిగపండి మరియు బరంపురం మధ్య మూడు రోడ్ల జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. దీంతో బరంపురం నగరంలోకి వస్తున్న ఒక కారుపై ఫస్ట్‌గేట్ దగ్గర ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి, 4 బస్తాల్లోని 82 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే కారులో ఉన్నటువంటి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైన వారు వెస్ట్ బెంగాల్, మిదనపూర్ జిల్లాకి చెందిన హరదన బెహరా, బిత్ దాస్‌లుగా నిర్ధారించారు. అలాగే రూ.13 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలియజేశారు.

స్కూటీ డిక్కీలో నగదు చోరీ


రాయగడ: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని ఒక గ్యారేజీ వద్దనున్న స్కూటీ డిక్కీ నుంచి రూ.90 వేల నగదు చోరీ జరిగింది. సదరు పోలీసుస్టేషన్ అధికారి కమలా కాంత్ కుహరో తెలిపిన వివరాల మేరకు.. స్థానిక కపిలాస్ కూడలిలోని ఏడీబీ బ్యాంకు నుంచి ఎం.సత్యనారాయణ అనే వ్యక్తి తన అకౌంట్‌లో ఉన్నటువంటి రూ.90 వేల నగదును మంగళవారం మధ్యాహ్నం విత్‌డ్రా చేసి తన స్కూటీ డిక్కీలో ఉంచాడు. కొంతదూరం వెళ్లేసరికి బైకు మోరాయించడంతో కొత్త బస్టాండ్ సమీపంలోని గ్యారేజీ వద్ద మరమ్మతులు చేయించాడు. ఆ సమయంలో అతను కొంత దూరంలో కూర్చున్నాడు. బైకు మరమ్మతులు పూర్తయిన తర్వాత డిక్కీ తెరిచి చూడగా అందులో ఉంచిన రూ.90 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. కూడలిలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు ఇద్దరు వ్యక్తులు ఈ నగదును చోరీ చేసినట్లు గుర్తించారు. దొంగలను త్వరలో పట్టుకుంటామని తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న జగబంధు నాయిక్

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని బొయిపరిగుడ సమితి దొరాగుడ పంచాయతీ మటికుపిలి–దొరాగుడ కూడలి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు బొయిపరిగుడ సమితి దొరాగుడ పంచాయతీ మినరబాలి గ్రామానికి చెందిన జగబంధు నాయిక్‌గా గుర్తించారు. జగబంధు పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని మెరుగైన వైద్యం కోసం కొరాపుట్ సహిద్ లక్ష్మణ్ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు.



• జాబిలిపై... మన జెండా...

యావత్ ప్రపంచం తీవ్ర ఉత్కంఠగా ఎదురుచూసిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం అయ్యింది. చంద్రయాన్ విజయవంతం కావాలని దేశవ్యాప్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. అదే విధంగా పూరీ సాగర తీరంలో సుదర్శన్ పట్నాయక్ శిష్య బృందం ఆవిష్కరించిన సైకత శిల్పం ఆకట్టుకుంది.

– భువనేశ్వర్


చారిత్రాత్మకం

• సీఎం నవీన్ పట్నాయక్

చంద్రుని దక్షిణ ధ్రువం దగ్గర చంద్రయాన్–3 విజయవంతంగా దిగిన మొట్టమొదటి అంతరిక్ష నౌక. ఈ రోజు భారతదేశానికి చారిత్రాత్మకమైన రోజుగా మిగిలిపోతుందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభినందించారు. ఖగోళ పరిశోధనలో భారతీయ విజ్ఞాన శాస్త్రానికి తిరుగులేని విజయమని పేర్కొన్నారు. చంద్రయాన్–3 విజయ యాత్రలో భాగమైన ఇస్రో మరియు అనుబంధ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.



వినువీధిలో... విజయ దరహాసం



మాట్లాడుతున్న పూరీ గోవర్ధన పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యులు స్వామీ నిశ్చలానంద సరస్వతి

- చంద్రయాన్ విజయంపై రాష్ట్రమంతా సంబరాలు
- పలుచోట్ల బిగ్ స్క్రీన్లు ఏర్పాటు

భువనేశ్వర్: చంద్రుని దక్షిణ ధ్రువంపైకి చంద్రయాన్–3 ప్రయోగంతో భారత్ అడుగు పెట్టడం చరిత్రాత్మక విజయమని దేశమంతా సంబరాలు జరుపుకుంటోంది. చంద్ర మండలానికి చేరేందుకు కొన్ని గంటల ముందు నుంచే అందరిలో విజయకాంక్ష బలం పుంజుకుంది. మిషన్ విజయవంతం కోసం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేపట్టారు. చంద్రుని ఉపరితలం దక్షిణ ధ్రువంలో ల్యాండర్ మాడ్యూల్ విక్రమ్ సురక్షితంగా ల్యాండింగ్ కోసం బుధవారం సాయంత్రం వివిధ సంస్థలు, విద్యార్థులు మరియు వ్యక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో హోమాదులు, పూజలు మరియు ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సాంస్కృతిక సంస్థ జయదేవ్ విహార్ ప్రాంతంలో ప్రత్యేక యజ్ఞం నిర్వహించింది. మరొక సంస్థ సభ్యులు శిల్పుల దేవుడు విశ్వకర్మను పూజించారు. పలు పాఠశాలల్లో చంద్రయాన్–3 విజయవంత దృశ్యం ప్రత్యక్ష ప్రసారం చేయడానికి పెద్ద స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. కటక్, బరిపద, బరంపురం, సంబల్‌పూర్, కేంద్రాపడా, బాలాసోర్, జగత్‌సింగ్‌పూర్ మరియు ఇతరేతర ప్రాంతాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులలో కూడా ఉత్సాహం తారాస్థాయికి చేరింది. ఈ మిషన్ విజయం భారత దేశ అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించిందని వీరంతా హర్షం వ్యక్తం చేశారు. చంద్రయాన్ 3 విజయం భారతీయులందరూ గర్వపడేలా చేయడమే కాకుండా, పరిశోధనా రంగంలో లోతుగా పరిశోధించడానికి చాలా మంది శాస్త్రవేత్తలు మరియు విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పలువురు హర్షించారు.

మరో మైలురాయి: గవర్నర్ గణేషీలాల్

చంద్రయాన్–3 మిషన్ విజయవంతంగా చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగిడడం ఖగోళ వైజ్ఞానిక రంగంలో మైలు రాయిగా నిలుస్తుందని రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ అభినందించారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలు మరియు భారతదేశ శాస్త్రవేత్తలను గవర్నర్ అభినందించారు.

ఈ ఘనత ఇస్రో శాస్త్రవేత్తలదే: జగద్గురు శంకరాచార్యులు స్వామి

పూరీ గోవర్ధన పీఠాధిపతి జగద్గురు శంకరాచార్యులు స్వామి నిశ్చలానంద సరస్వతి చంద్రయాన్–3 మిషన్ విజయవంతంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇస్రో శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు. చంద్రయాన్–3 విజయం ఇస్రో శాస్త్రవేత్తలకే దక్కుతుందని అభినందించారు. చంద్రుని దక్షిణ ధ్రువానికి చంద్రయాన్–3 చేరుకోవడం గర్వకారణమన్నారు. అంతరిక్ష విజ్ఞానానికి చంద్రయాన్–3 కొత్త దిశానిర్దేశం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అక్కడ సేకరించే ఛాయా చిత్రాలు, మట్టిని శాస్త్రీయ పద్ధతుల్లో క్షుణ్ణంగా పరీక్షించి మానవాళి ప్రయోజనాలకు అక్కరకు వచ్చే అంశాలపై శాస్త్రజ్ఞులు పరిశోధిస్తారన్నారు. ఈ పరిశోధనలు యావత్ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

గర్వకారణం: ప్రధాన కార్యదర్శి

ఇస్రో శాస్త్రవేత్తలు దేశం గర్వించేలా చేశారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా అన్నారు. అలాగే చంద్రుని దక్షిణ ధ్రువంపై అడుగిడిన చంద్రయాన్–3 విజయవంతమై ఆకాశం హద్దులను అధిగమించేందుకు దోహదపడిందని బీజేడీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ అమర్ పట్నాయక్ పేర్కొన్నారు. ఈ అద్భుతమైన విజయానికి సారథ్యం వహించిన ఇస్రో శాస్త్రవేత్తల బృందానికి అభినందనలు తెలిపారు.

• ఆకట్టుకున్న రంగవల్లులు



156వ స్వపరిపాలన దినోత్సవాలు పురస్కరించుకొని నగరంలోని బిజూ పట్నాయక్ కల్యాణ మండప ప్రాంగణంలో మహిళా కార్పొరేటర్లు, బీఎంసీ మహిళా ఉద్యోగులకు ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు బుధవారం నిర్వహించారు. పోటీల్లో వారంతా పాల్గొని ముగ్గులతో తమ ప్రతిభని కనబరిచారు. న్యాయ నిర్ణేతగా బీఎంసీ మేయర్ సంఘమిత్ర దొళాయి వ్యవహరించారు. విజేతలకు ఈనెల 31వ తేదీన జరగనున్న వేడుకల్లో రాష్ట్ర మంత్రులు ఉషాదేవి, శ్రీకాంత్ సాహు చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరుగుతుందని కమిషనర్ నోనాలి జెనా తెలియజేశారు.

– బరంపురం







రాష్ట్రంలో డెంగీ పరిస్థితిపై సమీక్ష



డెంగీ తీవ్రతపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో డెంగీ పరిస్థితిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా సమీక్షించారు. అనుబంధ విభాగాలు, శాఖల ఉన్నతాధికారులతో స్థానిక లోక్‌సేవా భవన్‌లో బుధవారం సమావేశమయ్యారు. డెంగీ నివారణ, నియంత్రణ కార్యాచరణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక నగర పాలక సంస్థ (బీఎంసీ) డెంగీ నిర్ధారణ పరీక్షలు ముమ్మరం చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ చర్యలు చురుకుగా సాగుతున్నట్లు వివరించారు. డెంగీ నిర్ధారణ పరీక్షలు గణనీయంగా పెరిగాయని, గత సంవత్సరంతో పోల్చితే డెంగీ పాజిటివ్ రేటు తక్కువగా నమోదవుతోందని మరియు పరిస్థితి అదుపులో ఉందని సమీక్షలో ఖరారైనట్లు వివరించారు. అలాగే ఆరోగ్య శాఖ సీనియర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా సమీక్షించారు. డెంగీ వ్యాప్తి అదుపులో ఉన్నప్పటికీ ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సాధారణ ప్రజానీకంలో చైతన్యం ప్రేరేపించే రీతిలో పలు కార్యక్రమాలు తరచూ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. డెంగీ నివారణపై సాధారణ ప్రజానీకానికి అవగాహన కీలకమన్నారు. విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. చికిత్సలో భాగమైన రక్తం, ప్లేట్‌లెట్లు మరియు అనుబంధ మందులతో నిరంతరం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణం, నగర అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ, మున్సిపల్ కమిషనర్, జాతీయ ఆరోగ్య మిషన్ (ఒడిశా) మేనేజింగ్ డైరెక్టర్, సమాచారం–ప్రజా సంబంధాలు శాఖ డైరెక్టర్, భువనేశ్వర్ నగర పాలక సంస్థ (బీఎంసీ) సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

పేరుగొప్ప ప్రభుత్వమిది



మాట్లాడుతున్న దుర్గా ప్రసాద్ పండా

- రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు
- ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండా

రాయగడ: రాష్ట్రంలోని బీజేడీది పేరుగొప్ప ప్రభుత్వమని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాధారణ కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండా అన్నారు. స్థానిక కాంగ్రెస్ భవనంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. బీజేడీ ప్రభుత్వంపై విమర్శల సంధించారు. ముఖ్యమంత్రి నవీన్ పనితీరుపై విరుచుకుపడ్డారు. అధికార బీజేడీ పార్టీ అమలు చేస్తున్న పథకాలు మురుగున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో బాకురుగుడ వద్ద సుమారు రూ.15 కోట్లతో నిర్మించిన ప్లానిటోరియం పనులు పూర్తైనా ప్రారంభానికి ఇంకా నోచుకోకపోవడం విచారకరమన్నారు. రెండేళ్లు పూర్తయ్యినప్పటికీ ప్రారంభించకపోవడంతో పరికరాలు తుప్పుపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఆరంభ శూరత్వమే కానీ ఆచరణలో పెట్టడం చేతకాదని విమర్శించారు. అలాగే స్థానిక ఎఫ్‌సీఐ గొడాం సమీపంలోని శీతల గిడ్డంగి నిరుపయోగమయ్యిందని ధ్వజమెత్తారు. దీంతో పండించిన పంటలను భద్రపరుచుకునే వీలులేక, రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు

జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారని దుర్గాప్రసాద్ ఆరోపించారు. నాణ్యత లేకపోవడంతో కొద్ది రోజులకే నిర్మాణాలు శిథిలమవుతున్నాయని దుమ్మెత్తిపోశారు. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పనులు చేపడుతున్నారన్నారు. కొద్దిరోజుల క్రితం కల్యాణ సింగుపూర్ సమితి సికరపాయి పంచాయతీలోని ఉపారొసాజ్జ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న కల్వర్టు సెంట్రింగ్ కూలిన ఘటనలో, ఐదుగురు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఎటువంటి గుర్తింపు లేని కాంట్రాక్టర్లు, సంస్థలకు పనులు అప్పగించడంతో ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయని వెల్లడించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బీజేడీకి గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శంకర్షన్ మంగరాజ్, సాధారణ కార్యదర్శి పి.వర్ధన్, జిల్లా యువజన కాంగ్రెస్ కమిటీ సాధారణ కార్యదర్శి అస్లామ్ ఖాన్, సీనియర్ నాయకుడు అప్పల స్వామి కద్రక తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వర్గాలకు భాగస్వామ్యం కల్పించాలి

- పథకాల అమలులో ప్రాధాన్యం కల్పించడం లేదు
- గవర్నర్‌కు పంచాయతీరాజ్ ప్రతినిధుల అభ్యర్థన



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధుల బృందం

భువనేశ్వర్: ప్రజాహిత పథకాల అమలు పురస్కరించుకుని అధికార వికేంద్రీకరణ కోసం రాజ్యాంగంలోని 73వ సవరణ స్ఫూర్తిని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో పథకాల అమలులో పంచాయతీరాజ్ సంస్థల ప్రమేయం ఉండేలా గవర్నర్ గణేషీ లాల్ జోక్యం చేసుకోవాలని ప్రతినిధుల బృందం అభ్యర్థించింది. ఈ మేరకు గవర్నర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అమ్మొ ఒడిశా – నవీన ఒడిశా పథకం అమలు పురస్కరించుకుని ఈ తప్పిదం చోటు చేసుకుందని స్థానిక పాలన సంస్థల సమూహం, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ (ఆర్‌జీపీఆర్‌ఎ) ప్రతినిధి బృందం గవర్నర్ దృష్టికి తీసుకెళ్లింది. ఈ పథకం కింద ప్రతీ గ్రామ పంచాయతీకి రూ.50 లక్షలు వెచ్చించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రాజెక్టుల అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దురదృష్టవశాత్తు ఈ పథకంలో పంచాయతీ రాజ్ సంస్థల (పీఆర్‌ఐ) సభ్యుల ప్రాతినిధ్యానికి ఏమాత్రం అవకాశం కల్పించకపోవడం విచారకరమన్నారు. పథకం అమలు, కార్యాచరణ, నిధుల వినియోగం వగైరా కార్యకలాపాల్లో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పరిషత్ కార్య నిర్వహణ అధికారి ఇతరేతర ప్రభుత్వ శాఖలకు సకల అధికారాలు, అవకాశాలు కల్పించి, పంచాయితీ రాజ్ ప్రజా ప్రతినిధులకు దూరం చేయడం ఎంతమాత్రం తగదని బృందం వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తాజా పథకం నిర్వహణకు అంతరాయం కలగకుండా, భారత రాజ్యాంగ సవరణ నిబంధనల మేరకు కార్యాచరణ చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. పథకం అమలులో గ్రామసభ, పంచాయతీ రాజ్ సంస్థలు మరియు వారి సభ్యులకు భాగస్వామ్యం కల్పించేలా ప్రభుత్వానికి ఆదేశించాలని తెలిపారు. ప్రతినిధి బృందంలో మాజీ ఎమ్మెల్యే ఉమా వల్లభ రౌథొ, బిజయ్ ప్రధాన్, సమరేంద్ర మిశ్రా, బిస్మయ్ మహాపాత్ర తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

నూతన ఆవిష్కరణకు పేటెంట్



ఎచ్చెర్ల క్యాంపస్: నూజివీడులో నిర్వహిస్తున్న శ్రీకాకుళం రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం సీఎస్ఈ ఇంజినీరింగ్ విభాగం చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కోడా ప్రదీప్ తన ఆవిష్కరణకు పేటెంట్ సాధించారు. ఎలక్ట్రికల్ వాహన టెక్నాలజీకి సంబంధించిన పరిశోధనకు గాను భారత ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ త్వరితగతిన చేయటం, సురక్షితంగా చార్జింగ్ చేసేందుకు ఈ ఆవిష్కరణ ఉపయోగపడుతుంది. కృత్రిమ మేధ ఆధారంగా ఈ ఆవిష్కరణ చేసినట్లు ప్రదీప్ తెలిపారు. ఈ ఆవిష్కరణ విజయం పట్ల ఆదిమవాసీ ఉద్యమ హక్కుల నేత కోడా సింహాద్రి, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి హర్షం వ్యక్తం చేశారు.

బార్గో యాప్ పనితీరు పరిశీలన



గ్రావెల్ రోడ్డును పరిశీలిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

గార : ఉపాధి హామీ పథకానికి సంబంధించి క్షేత్రస్థాయిలో బార్గో యాప్ తీరుతెన్నులను డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు పరిశీలించారు. అంపోలు పంచాయతీ వంశధార చానెల్ రోడ్డులో జరిగిన గ్రావెల్ రోడ్డు పనులు, యాప్‌లో ఉన్న సమాచారాన్ని బుధవారం ఉదయం పరిశీలించారు. యాప్‌లో అన్ని పనులను పర్యవేక్షించేందుకు సులువు అవుతుందన్నారు. జిల్లా స్థాయిలో ఇప్పటివరకు జరిగిన పనులను పరిశీలిస్తున్నామని పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సీహెచ్.సంధ్యారాణి, జేఈ నారంనాయుడు, టీఏలు మన్మధరావు, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు భరోసా



భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: విశ్రాంత ఉద్యోగుల సంఘానికి అండగా ఉంటామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం ఏపీహెచ్‌బీ కాలనీలో కొత్తగా నిర్మించిన విశ్రాంత ఉద్యోగుల భవనాన్ని మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు ఉపయోగపడేలా భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: అంపోలు సబ్ జైలులో బుధవారం ఖైదీలకు లయన్స్ క్లబ్ ఆఫ్ పలాస కాజ్యూ, లేడ్ వనిత ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైలర్ ఉదయ్‌భాస్కర్, డిప్యూటీ జైలర్ ఎస్.రామకృష్ణ, లయన్స్ క్లబ్ మెంబర్స్ నటుకుల మోహన్, దేవభూషణ్, మల్ల జయశ్రీ, టి.శ్వేతకుమారి తదితరులు పాల్గొన్నారు.

గులివిందలపేటలో పులి!



కొత్తూరు: మండలంలోని గులివిందలపేట ప్రాంతంలో పులి పాదముద్రలు కలకలం సృష్టించాయి. బుధవారం పంట పొలాలను పరిశీలించేందుకు రైతులు వెళ్లగా పులి పాదముద్రలు చూసి ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అనంతరం గ్రామస్తులకు విషయం చెప్పడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు. రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు కూడా భయపడుతున్నారు.

సేవ ముసుగులో వసూళ్లు

- కుటుంబ కలహాలు పరిష్కరిస్తానని మోసం
- మా ఘర్ సురక్ష సేన్ అధ్యక్షురాలి నిర్వాకం
- అరెస్టు చేసిన పోలీసులు



ప్రశాంతి ఇంటిలో స్వాధీనం చేసుకున్న సామగ్రి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితికి చెందిన తపస్ బోం అనే వ్యక్తి తన భార్యతో గొడవలు కారణంగా విడిగా ఉంటున్నారు. దీనినే ఆసరాగా తీసుకున్న మల్కన్‌గిరి మా ఘర్ సురక్ష సేన్ అధ్యక్షురాలు ప్రశాంతి లతా బిసాయి ఆ కుటుంబ సమస్యలు పరిష్కరిస్తానని నమ్మబలికింది. దీనిలో భాగంగా తపస్ భార్యతో కలిమెల పోలీసుస్టేషన్‌లో వివిధ కేసులు నమోదు చేయించింది. అనంతరం కేసులు మాఫీ చేయాలంటే అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాలని, లేదంటే జైలుకి పంపుతానని తపస్‌ను భయపెడుతోంది. దీంతో తనను ప్రశాంతి బెదిరిస్తోందని కలిమెల పోలీసుస్టేషన్‌లో ఆయన సోమవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆమెను మంగళవారం విచారించారు. ఈ సందర్భంగా ఆరోపణలు నిజమవ్వడంతో అరెస్టు చేశారు.

ఇదివరకూ వివాదాస్పదమే...

అయితే గతంలోనూ ప్రశాంతి ఎందరో మహిళల జీవితాలను బాగు చేస్తానని నమ్మించి వసూళ్లకు పాల్పడిందని ఆరోపణలు ఉన్నాయి. మల్కన్‌గిరిలో మా ఘర్ శాంతి సీన్ పేరుతో మొదట మా ఘర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు రూతుపూర్ణ మహంతి ఈ సంస్థను స్థాపించారు. దీనిలో కొంతమందిని చేర్పించి దానికి ప్రెసిడెంట్‌గా ప్రశాంతిని నియమించారు. అయితే ప్రశాంతి అప్పటి నుంచే ప్రజల నుంచి డబ్బులు తీసుకోవడం జరగడంతో, ఆమెతో పాటు ఆ బృందాన్ని సంస్థ నుంచి తొలగించారు. అయితే వెంటనే ప్రశాంతి అదే బృందంతో కలసి మా ఘర్ సురక్ష సేన్ అనే పేరుతో సంస్థను స్థాపించింది. ఈ విషయం తెలిసిన రుతుపూర్ణ మహంతి మల్కన్‌గిరి కలెక్టర్, ఎస్పీలకు లిఖిత పూర్వక లేఖను అందజేశారు. తమ సంస్థ పేరులో ఉన్నటువంటి మా ఘర్ అనే పదం వాడకంపై చర్యలు తీసుకోవాలని 2022లోనే ఫిర్యాదు చేశారు. అయితే ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఇప్పటికైనా ఆమెపై చర్యలు తీసుకోకపోతే లీగల్ ముందుకెళ్తానని మా ఘర్ శాంతి సీన్ అధ్యక్షురాలు రుతుపూర్ణ బుదవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పోలీసులు ప్రశాంతి ఇంటిలో సోదాలు చేసి కంప్యూటర్, ఆమె పనిచేసిన మా ఘర్ శాంతి సీన్ సంస్థకు చెందిన కొన్ని కాగితాలు, ఇంకొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ప్రశాంతి బీజేడీ పార్టీలో ఒక కీలక పాత్రను పోషిస్తోంది.



ప్రజలను మోసం చేస్తున్న ప్రశాంతి లత బిసోయి



మా ఘర్ శాంతి సీన అధ్యక్షురాలు రుతుపూర్ణ మాహంతి



ప్రశాంతి ఇంటిలో సోదాలు చేస్తున్న పోలీసులు

రవాణా సేవలు మెరుగుపర్చేందుకు కృషి



ఆదర్శ బస్టాండ్‌లను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

- పలు ప్రాజెక్టులు ప్రారంభించిన సీఎం నవీన్

భువనేశ్వర్: రాష్ట్రంలో రవాణా సేవలను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదర్శ అమ్మొ బస్టాండ్‌లు, ఎం పరివాహన్ సేవ యాప్ మరియు సువాహక్ శిక్షణ కేంద్రంను ప్రజలకు అంకితం చేశారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి టుకుని సాహు పాల్గొన్నారు. 13 జిల్లాల్లో 21 మండల స్థాయి ఆదర్శ బస్టాండ్‌లు ముఖ్యమంత్రి ప్రారంభించారు. మరో 26 జిల్లాల్లో 124 మండల స్థాయి ఆదర్శ బస్టాండ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

సువాహక్ శిక్షణ కేంద్రం

ఉపాధి కోసం డ్రైవింగ్ శిక్షణ కేంద్రం సువాహక్‌ని ప్రారంభించారు. గంజాం జిల్లా బరంపురం పాలూరు ప్రాంతంలో మోడల్ డ్రైవింగ్ శిక్షణా సంస్థని ప్రారంభించారు. ఈ ఏడాది రాష్ట్రంలో 50,000 మంది భారీ మోటారు వాహన (హెచ్‌ఎంవీ) డ్రైవర్లు మరియు 8,400 మంది ఔత్సాహిక హెచ్‌ఎంవీ డ్రైవర్లు ఈ సంస్థలో నైపుణ్య శిక్షణ పొందుతారు. వాహనాలు నడపడంలో డ్రైవర్లలో నైపుణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా వాహనాలు, లైసెన్స్‌లు మరియు ఇతర వాటికి సంబంధించిన అనేక సమాచారాన్ని పొందేందుకు ఎం పరివాహన్ సేవ మొబైల్ యాప్‌ను ప్రారంభించారు.

సర్వే సిబ్బంది నిర్బంధం



గ్రామస్తుల నిర్బంధంలో ఉన్న సర్వే సిబ్బంది

ఎల్.ఎన్.పేట: మండలంలోని డొంకలబడవంజ గ్రామంలో సమగ్ర భూమి రీసర్వే చేస్తున్న సిబ్బందిని స్థానిక రైతులు అడ్డుకున్నారు. గ్రామ పరిధిలోని సాగరం చెరువులో కొన్నేళ్ల క్రితం ఓ వ్యక్తికి సుమారు 6 ఎకరాల భూమికి డీ పట్టా ఇచ్చారు. సదర వ్యక్తి ఎక్కడున్నారో తెలియదని, ఆయన సాగులో కూడా లేదని, డీ పట్టా రద్దు చేయాలని ప్రజా ప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చినప్పటికీ పట్టించుకోకుండా ఆదే వ్యక్తి పేరుతో భూమి ఉన్నట్లు నమోదు చేయటం పట్ల రైతులు ఆందోళనకు దిగారు. సర్వే సందర్భంగా కుటుంబ సభ్యుల పేర్లతో భూముల వివరాలు నమోదు చేయటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మండల సర్వేయర్ రెడ్డి గవరయ్యతో పాటు ఇతర సిబ్బందిని అడ్డుకున్నారు. వారిని నిర్బంధించి గ్రామంలోనే ఉంచారు. ఉన్నతాధికారులు వచ్చి కచ్చితమైన సమాచారం ఇస్తేనే విడిచిపెడతామని స్పష్టం చేశారు.

పారిశ్రామిక అవసరాలు తెలుసుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులు పారిశ్రామిక అవసరాలు తెలుసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, మన్యా టెక్నో సొల్యూషన్స్ సీఈఓ (హైదరాబాద్) కిరణ్ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం నాలుగు రోజులపాటు నిర్వహించనున్న 'కళాశాల నుంచి కార్పొరేట్ ఉద్యోగం వరకు' అన్న అంశంపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ రంగంలో పరిశ్రమలు విస్తరిస్తున్నాయన్నారు. పరిశ్రమల అవసరాలు దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు నైపుణ్యాలు సాధించాలన్నారు. ఇంజినీరింగ్‌లో అమలు చేస్తున్న ఇంటర్న్‌షిప్‌లో మంచి కంపెనీలు ఎంచుకుంటే విషయ పరిజ్ఞానం, పని చేసే నైపుణ్యం సాధించవచ్చన్నారు. అధునాతన సాఫ్ట్‌వేర్లు తెలుసుకోవాలన్నారు. ఇంటర్వ్యూ స్కిల్స్ సైతం కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సి.వి.రమణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే ఉత్తమ ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: నిరంతర సాధనతోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణుడు బొడ్డేపల్లి భూపతిరావు అన్నారు. కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. పాఠశాల విద్య నుంచి క్రమశిక్షణతో చదవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో మంచి ప్రతిభ ఉందన్నారు. విద్యార్థులు ప్రతి పాఠ్యాంశాన్ని విశ్లేషణ, అవగాహన పద్ధతుల్లో చదవాలన్నారు. ప్రాధాన్యత గల అంశాలను నోట్స్ రాసుకోవాలని, సందేహాలు ఉంటే ఉపాధ్యాయులు దృష్టికి తీసుకువెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం పిల్లల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట పంచాయతీ సనపలవానిపేట వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 65 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఘటనా స్థలంలోనే వృద్ధురాలు మృతి చెందింది. వివరాలు తెలిసిన వారు ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై వి.సత్యనారాయణ పేర్కొన్నారు.



వృద్ధురాలి మృతదేహం

ప్రాణాలు తీసిన నిర్లక్ష్యం

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇద్దరు యువకుల మృతి
- సెగిడిపేటలో బోరు తవ్వుతుండగా రిగ్‌ను తాకిన విద్యుత్ తీగలు
- మృతులు ఒడిశావాసులు



మృతి చెందిన బిమ్ము సొరా



మృతి చెందిన హోడా బాగ్రియా



విద్యుత్ షార్టు సర్క్యూట్‌కు గురైన రిగ్

ఎచ్చెర్ల క్యాంపస్: నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. ఎచ్చెర్ల మండలం ముద్దాడ పంచాయతీ సెగిడిపేటలో రైతు యగాడి హేమాచలం పొలంలో రిగ్‌తో వ్యవసాయ బోరు తవ్వేందుకు రణస్థలంకు చెందిన వాల్లే రమణతో ఒప్పందం కుదుర్చుకున్నారు. బుధవారం బోరు తవ్వకం పనులు ప్రారంభించారు. బోరు తవ్వుతున్న ప్రదేశం మీదుగానే 7 కేవీ విద్యుత్ లైన్లు వెళ్తున్నాయి. తీగలను కర్రతో తప్పించి బోరు తవ్వాలని భావించారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ సిబ్బందికి చెప్పలేదు. తవ్వకం ప్రారంభంలోనే విద్యుత్ తీగలను రిగ్ పైభాగం తాకింది. దీంతో విద్యుత్ షార్టు సర్క్యూట్ అయ్యింది. ఈ సమయంలో ఐదుగురు సిబ్బంది పని చేస్తున్నారు. వారిలో కింద పనిచేస్తున్న బిమ్ము సొరా (20), హోడా బాగ్రియా (31) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు పరుగులు తీశారు. మృతులిద్దరిదీ ఒడిశా రాష్ట్రం. ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు తోటి వర్కర్లు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను శ్రీకాకుళం రిమ్స్ మార్చురీకి తరలించారు. ఎస్సై వి.సత్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముదులి, వేదికపై బీడీవో సాబొతొ, సమితి అధ్యక్షురాలు టున్ని తదితరులు

- ఎమ్మెల్యే మకరంద ముదులి
- సజావుగా సమితి సమీక్ష సమావేశం



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు, సమితి సభ్యులు

రాయగడ: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి సూచించారు. రాయగడ సమితి కార్యాలయం సద్భావనా హాల్‌లో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమితి పరిధిలోని సర్పంచ్‌లు, సమితి సభ్యులు వారి వారి ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయ లోపం లేకుండా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని హితవు పలికారు. ముఖ్యంగా తాగునీరు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రజా సంక్షేమార్థం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం ప్రజలకు చేరాలని ఆకాంక్షించారు.

అధికారులపై మండిపాటు

అనంతరం బైరాగి హలువ, మీరావలి, బొడొఆలుబడి, నకిటి తదితర పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, సమితి సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. తమ ప్రమేయం లేకుండానే కొన్ని పనులు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారని నకిటి పంచాయతీ సర్పంచ్ సత్య భూషణ బిడిక అన్నారు. ఏదైనా సమస్యను అధికారుల దృష్టికి తీసుకొస్తే కనీసం అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమ కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించగలిగినప్పుడే సమస్యలు పరిష్కారం దిశగా వెళ్తాయన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ తీరును మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బీడీవో లక్ష్మీనారాయణ సాబొతొ మాట్లాడుతూ అందరి సహకారం లేనిదే అభివృద్ధి సాధ్యపడదన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు స్పందించకుంటే తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమితి వైస్ చైర్మన్ హర ప్రసాద్ హెప్రుక, ఏబీడీవో కాలు చరణ్‌లెంక, అసిస్టెంట్ ఇంజినీర్ ఎ.షన్ముఖ పాత్రో, జిల్లా పరిషత్ సభ్యులు సంధ్యా పులక, ప్రశాంత్ కులసిక, పద్మావతి మండంగి, కొరాపుట్ లోక్‌సభ ఎంపీ ప్రతినిధి జీవితేశ్వరరావు, జీపీవో గోపాల్ పండ తదితరులు పాల్గొన్నారు.

గజపతిలో 42 డెంగీ కేసులు

- కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్



మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ప్రస్తుతం 42 మంది డెంగీతో బాధపడుతున్నారని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలియజేశారు. వారిలో కాశీనగర్ సమితి సరా గ్రామంలో 32 మంది బాధపడుతున్నారని, అక్కడికి ఒక మెడికల్ టీమ్‌ను పంపించినట్లు పేర్కొన్నారు. అలాగే మోహనా నియోజకవర్గంలో ఐదుగురు, గుమ్మాలో ముగ్గురు, పర్లాకిమిడిలో ఇద్దరు డెంగీ సోకినవారిలో ఉన్నారన్నారు. కాశీనగర్, గుమ్మాలో మొబైల్ హెల్త్ యూనిట్ ద్వారా చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు. అలాగే జిల్లాలోని గుమ్మా, ఆర్.ఉదయగిరి సమితి కేంద్రాల్లో నూతన బస్టాండ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వర్చువల్‌గా ప్రారంభించినట్లు తెలియజేశారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులు

జయపురం: ఒక ఆటో అదుపు తప్పడంతో అందులో నలుగురి ప్రయాణికులతో పాటు ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బొయిపరిగుడ సమితి రామగిరి పోలీసు పంటికి 2 కిలోమీటర్ల దూరంలో బుధవారం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గాయపడినవారిని మరో వాహనంలో రామగిరి ప్రాథమిక వైద్య కేంద్రానికి తీసుకెళ్లారు. విషయం తెలిసిన రామగిరి పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరణ ప్రకారం రాణిగడ గ్రామం నుంచి పారాబటి గ్రామంలోని బంధువుల ఇంటిలో పెద్దకర్మలో పాల్గొనేందుకు ఆటోలో నలుగురు వచ్చారు. కార్యక్రమం అయిన తర్వాత తిరిగి తమ గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

జాబిల్లిపై జాతి కేతనం ఎగిరిన వేళ



జి.సిగడాం: కేజీబీవీలో బాలికలు టీవీ చూస్తూ అభినందనలు తెలుపుతున్న దృశ్యం



శ్రీకాకుళం అర్బన్: ఆనందంలో విద్యార్థులు



శ్రీకాకుళం రూరల్: వప్పంగిలో విద్యార్థుల ర్యాలీ

జి.సిగడాం: అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డును సృష్టించిన భారత్ శాస్త్రవేత్తలకు సలాం అంటూ బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదువుతున్న బాలికలు అభినందనలు తెలిపారు. టీవీలో ప్రచారాన్ని వీక్షించారు. దేశం ఖ్యాతిని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిపిన ఇస్రో శాస్త్రవేత్తలకు సలాం చేశారు. విద్యాలయం ప్రత్యేక అధికారి ఉషారత్నం కుమారితోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరంలోని గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చంద్రయాన్–3 విజయవంతమైన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రతినిధులు మాట్లాడుతూ అగ్ర దేశాలు సైతం సాధించలేని విజయం భారతదేశం సాధించిందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషికి, శ్రమకు దేశం మొత్తం జోహార్లు చేస్తోందన్నారు. భారత్‌మాతాకీ జై అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.

వప్పంగి స్కూల్లో..

శ్రీకాకుళం రూరల్: వప్పంగిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జయహో చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. చంద్రునిపై భారతీయ శాస్త్రవేత్తలు ప్రయోగించిన ఉపగ్రహం ఆర్బిటాల్‌ను విజయవంతం కావడంతో ఈ ర్యాలీ చేపట్టారు. ప్రధానోపాధ్యాయురాలు టి.ఉమాకుమారి మాట్లాడుతూ.. సైన్సు పట్ల విద్యార్థులు ఆసక్తి కనబర్చాలన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్:

బలగలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామికి క్షీరాభిషేకాలు జరిగాయి. ఉదయం ఐదు గంటల నుంచే ప్రారంభమైన పంచామృతాభిషేకాల సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు దేవరకొండ శంకరనారాయణ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు, ఏర్పాట్లు చేశారు.

- పాతశ్రీకాకుళంలోని ధర్మశాస్తా దేవాలయంలోని అయ్యప్పస్వామి ఆలయంలో కూడా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని 45 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

సీతానగరం: సీతానగరం రైల్వేస్టేషన్ పరిధిలో పాత రైల్వేగేట్ సమీపంలో బుధవారం ఉదయం రైలు ఢీకొని సుమారు 45 గొర్రెలు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలో పెదభోగిల గ్రామానికి చెందిన బొమ్మ అప్పలనాయుడు, హడ్కో కోలనీకి చెందిన నాగళ్ళ రాము, పాపమ్మవలసకు చెందిన కోడిబోను మంగయ్యలకు చెందిన సుమారు 45 గొర్రెలు తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో బొబ్బిలి నుండి పార్వతీపురం వైపు వెళ్తున్న గూడ్స్ ఢీకొని మృతి చెందాయి. సుమారు ఆరు లక్షల రూపాయలు విలువైన గొర్రెలు మృతి చెందినట్టు బాధితులు రోదిస్తున్నారు. ఈ సంఘటనపై బొబ్బిలి ఆర్పీఎఫ్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. గొర్రెలకు బీమా లేకపోవడంతో ప్రభుత్వం గొర్రెల కాపరుల కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

26న జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్: ఫైజర్ ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు పార్వతీపురం గాయత్రి డిగ్రీ కళాశాలలో ఈ నెల 26వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ పీవీకే మణికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ 50% మార్కులతో ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 20 సంవత్సరాల మధ్య వయస్సు వున్న మహిళలందరూ జాబ్ మేళాకు అర్హులని తెలిపారు. నెలకు రూ.12,500 జీతంతో పాటు, ప్రముఖ విశ్వవిద్యాలయంలో డిగ్రీ విద్యను కూడా ఉచితంగా చదివిస్తారని చెప్పారు. జాబ్ మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్సు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 8754048632 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

బైకు చోరీ

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామానికి చెందిన వట్టికూటి సతీష్ రాజాపులోవ కేంబ్రిడ్జ్ స్కూల్లో ఏసీ మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 20వ తేదీ ఉదయం బైకుపై స్కూల్లో విధులకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి చేరుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకు కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాలు వెతికాడు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తవుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

భోగాపురం: బైకును ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో వ్యక్తి తీవ్ర గాయాల పాలైన సంఘటన ఈ నెల 21న ముంజేరు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. భోగాపురం మండలంలోని రామచంద్రపేట గ్రామానికి చెందిన బమ్మిడి అచ్చన్నప్పడు తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 21న సాయంత్రం భోగాపురంలో తాపీ పనులు ముగించుకుని బైకుపై తిరిగి ఇంటికి బయలుదేరాడు. మార్గం మధ్యలో ముంజేరు చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న ఆటో బైకును బలంగా ఢీకొట్టడంతో అచ్చన్నప్పడు తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న బంధువులు అచ్చన్నప్పడును విశాఖపట్నం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడు అచ్చన్నప్పడు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తవుడు తెలిపారు.

సక్రమంగా వైద్య సేవలు: డీఎంహెచ్ఓ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

బొబ్బిలి: ప్రజలకు అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు మందులను అందజేసే వైద్య సేవలను 24 గంటలూ అందజేస్తామని జిల్లా వైద్యాధికారి భాస్కరరావు అన్నారు. మండలంలోని పిరిడి పీహెచ్‌సీని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సేవలందించాలన్నారు. హాజరు పట్టీని, రికార్డులను పరిశీలించారు. శివడవలసలో నిర్వహించిన 104 వాహన వైద్య శిబిరాన్ని సందర్శించారు. పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రతీ కుటుంబానికీ ప్రభుత్వ వైద్య సేవలందాలన్నారు.

అయ్యవార్లకు.. అవార్డుల పండగ

- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
- ప్రభుత్వ ఉత్తర్వులు
- మార్గదర్శకాలు విడుదల



చిట్టపులివలస పాఠశాలలో ఆకులతో బొమ్మల తయారీ విధానంపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

వీరఘట్టం: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు - 2023కు దరఖాస్తు చేసేందుకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, డైట్, సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఈ అవార్డుకు అర్హులు. మండల/డివిజన్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఆహ్వానం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 24వ తేదీ వరకు గడువు పెంచారు. జిల్లా స్థాయి ఉపాధ్యాయులకు 25 నుంచి 28వ తేదీ వరకు, రాష్ట్ర స్థాయి అవార్డుకు 29 నుండి 31వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉంది. వచ్చిన దరఖాస్తులను ఆయా స్థాయిలోని కమిటీలు పరిశీలిస్తాయి.

వివిధ స్థాయిల్లో కమిటీలు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు మండల స్థాయిలో ఎంఈఓ చైర్మన్‌గా కమిటీ ఉంటుంది. ఇందులో స్థానిక హెచ్‌ఎం, డైట్ లెక్చరర్/మండలానికి చెందని మరో హెచ్‌ఎం సభ్యులుగా ఉంటారు. ఎంఈఓ పరిధిలోని ప్రాథమిక/ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ఒకరిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు వారు పనితీరు ఆధారంగా మార్కులు కేటాయిస్తారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయుల జాబితాను ఎంఈఓలు జిల్లా విద్యాశాఖాధికారికి అందజేయాల్సి ఉంటుంది.

- (డివిజన్ స్థాయిలో డీవైఈఓ చైర్మన్‌గా, మరో ఇద్దరు సభ్యులతో కూడిన కమిటీ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఎంపిక చేయాల్సి ఉంటుంది.
- జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఈఓ కన్వీనర్‌గా, డైట్ ప్రిన్సిపాల్, ప్రముఖ విద్యావేత్త, కలెక్టర్ ఎంపిక చేసిన మరో జిల్లా స్థాయి అధికారితో కూడిన కమిటీ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తుంది.
- రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు కూడా జిల్లా నుంచి ఎంపిక చేస్తారు.
- అసంపూర్తిగా ఉన్న, ఫొటోలు లేని, ఆలస్యంగా వచ్చే దరఖాస్తులను పరిశీలనలోకి తీసుకోరు.

తొమ్మిది కేటగిరీల్లో...

- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు తొమ్మిది కేటగిరీల్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. హైస్కూళ్లలో హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్లు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో హెచ్‌ఎం, ప్రైమరీ, యూపీ స్కూళ్లలో ఎస్‌జీటీ, హైస్కూళ్లలో డ్రాయింగ్, క్రాఫ్ట్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మ్యూజిక్ టీచర్లు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇవీ మార్గదర్శకాలు

- రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకొనే ఉపాధ్యాయులు కనీసం 10 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకొని ఉండాలి.
- ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, డైట్ లెక్చరర్లు, ఎంఈఓలు, ఇతర తనిఖీ అధికారులు అర్హులు కారు. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఎటువంటి క్రమశిక్షణా చర్యలు, క్రిమినల్ కేసులు లేని వారు మాత్రమే అర్హులు.
- గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఉండాలి.
- అర్హులైన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారి దరఖాస్తులను ఎంఈఓలకు సమర్పించాలి.
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ప్రతిపాదన చేసే ఉపాధ్యాయులకు సంబంధించి పది లైన్లుకు మించకుండా పరిశీలనాధికారి రాయాల్సి ఉంటుంది.

పారదర్శకంగా ఎంపిక



జిల్లా, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానించాం. వచ్చిన దరఖాస్తులను పరిశీలన అనంతరం పూర్తి పారదర్శకంగా ఎంపిక చేస్తాం. జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుదారుల్లో అన్ని విభాగాల్లోనూ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తాం.

– ఎస్.ప్రేమ్‌కుమార్, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

ప్రజలకు చేరువగా సహకార బ్యాంకు సేవలు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



పెరుమాళిలో పెట్రోల్ బంకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తదితరులు

తెర్లాం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) సేవలను ప్రజలు, డ్వాక్రా సంఘాల మహిళలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని పెరుమాళి పీఏసీఎస్ ఆధ్వర్యంలో డీసీసీబీ ఆర్థిక సహకారంతో కొత్తగా ఏర్పాటుచేసిన పెట్రోల్‌బంకును బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఆప్కాబ్ ఎం.డి. శ్రీనాథ్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జెడ్పీచైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో అన్ని సంస్థలు బలోపేతమవుతున్నాయన్నారు. సహకార బ్యాంకుల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. డీసీసీబీలో ప్రతీ ఒక్కరూ డిపాజిట్లు చేయాలని, అన్ని బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ డీసీసీబీలోనే వస్తుందన్నారు. అతి తక్కువ వడ్డీకే పంట, బంగారు, వ్యాపార రుణాలను రైతులు, డ్వాక్రా సంఘాలకు అందజేస్తోందని చెప్పారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో డీసీసీబీలు, పీఏసీఎస్‌లు దివాళాతీసే దశకు చేరుకున్నాయని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సహకార రంగం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. ఆప్కాబ్ ఎం.డి. శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పెరుమాళి పీఏసీఎస్ 16 కోట్ల టర్నోవర్‌కు చేరుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది ఆప్కాబ్ ద్వారా రాష్ట్రంలో 100 పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇంతవరకు 32 పెట్రోల్ బంకుల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ జగనార్దన్, నాబార్డు డీజీఎం నాగార్జున, తెర్లాం, బొబ్బిలి వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు ఎస్.బాబ్జీరావు, ఎస్.వేణుగోపాలనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సీహెచ్.సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి రామారావు, పెరుమాళి, తెర్లాం, నందిగాం పీఏసీఎస్ అధ్యక్షులు సాంబరాజు, లక్ష్మణరావు, మృత్యుంజయరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమగ్రసేవా కేంద్రాలుగా పీఏసీఎస్‌లు

– ఆప్కాబ్ ఎం.డి. శ్రీనాథ్‌రెడ్డి

విజయనగరం అర్బన్: రైతుకు అవసరమైన అన్ని సేవలను అందించే సమగ్ర సేవా కేంద్రాలుగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్)ను తీర్చిదిద్దుతున్నట్టు ఏపీ సహకార బ్యాంకు (ఆప్కాబ్) ఎం.డి. ఆర్.శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. విజయనగరంలోని డీసీసీబీ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సాగుకు అవసరమైన రుణాలతోపాటు నాన్ క్రెడిట్ అంశాలైన ఎరువుల పంపిణీ, వ్యవసాయ ఉత్పత్తుల స్టోరేజ్ గొడౌన్‌ల నిర్వహణ వంటి సేవలతో కామన్ సర్వీసెస్ సెంటర్లు (సీఎస్‌సీ)గా పీఏసీఎస్‌లు రూపుదిద్దుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన 800 పీఏసీఎస్‌లకు ఈ ఏడాది డిసెంబర్ 24వ తేదీలోగా ఆర్థిక పరిపుష్టిని కలిగిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని రెండువేల పీఏసీఎస్‌లు ఉండగా, వంద పీఏసీఎస్‌ల పరిధిలో పెట్రోల్‌బంకులు నిర్వహించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు 32 చోట్ల పెట్రోలు బంకులు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. జన ఔషధ వ్యాపారాన్ని ఇప్పటికే 30 పీఏసీఎస్‌ల పరిధిలో చేపట్టామన్నారు. డీసీసీబీలు, పీఏసీఎస్‌ల ద్వారా మరో 3, 4 నెలల్లో పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఆయన వెంట ఆప్కాబ్ ఏజీఎం జి.ఎస్.ఎన్.రాజు, జనార్దన ఉన్నారు.

7.8కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయిని రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తూనిక వేస్తున్న పోలీసులు

పాచిపెంట: ఆర్టీసీ బస్సులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తి నుంచి బుధవారం 7.8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఉమామహేశ్వర శర్మ ఒడిశా నుంచి ఆర్టీసీ బస్సులో 7.8 కేజీల గంజాయి సాలూరు వైపు తరలిస్తుండగా పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నామన్నారు. సదరు వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తూకం వేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సాలూరు రూరల్ సీఐ ధనుంజయరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

పాలకొండ రూరల్: మండలంలోని తుమరాడ వద్ద ఈ నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎస్.నరసింహరావు(34) బుధవారం శ్రీకాకుళం ఆస్పత్రిలో మరణించారు. వీరఘట్టం మండలం బిటివాడకు చెందిన మృతుడు తన ద్విచక్ర వాహనంపై పాలకొండ వస్తున్న క్రమంలో కుక్క అడ్డు రావటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పాలకొండ ఎస్ఐ బి.శివప్రసాద్ తెలిపారు. పాత సామాన్ల క్రయ విక్రయ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఈయనకు మృతునికి భార్య శిరీష, తల్లి చిన్నమ్మి ఉన్నారు.

28, 30 తేదీల్లో హౌస్ కీపర్స్ పోస్టులకు ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్‌లో హౌస్‌కీపర్స్ (స్త్రీలు మాత్రమే) పోస్టులకు ఈ నెల 28, 30 తేదీల్లో గాజులరేగ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి 3 గంటల మధ్యలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, డిప్లమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్ విద్యార్హతగల వారు పోస్టులకు అర్హులన్నారు. వయస్సు 30 నుంచి 40 సంవత్సరాల మధ్యలో ఉండాలని తెలిపా రు. జీతం నెలకు రూ.12 వేలు ఇస్తామని చె ప్పారు.

పురుగు మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య



మృతుడు సూర్యనారాయణ(ఫైల్)

బాడంగి: భార్య మందలించడంతో మనస్తాపానికి గురై ఓ వృద్ధుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పాల్తేరు గ్రామానికి చెందిన తేలు సూర్యనారాయణ(68) తాగుడుకు బానిసైన ఇంట్లో దాచిపెట్టిన డబ్బులు, పింఛన్ డబ్బులు కుటుంబ సభ్యులకు తెలియకుండా ఖర్చు చేశాడు. దీంతో భార్య సోములమ్మ మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన సూర్యనారాయణ మంగళవారం అర్ధరాతి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు 108లో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కుమార్తె అర్నెపల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆర్.జయంతి చెప్పారు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె ఉన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితాకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటి ఓటరు విచారణ 98 శాతం పూర్తయ్యిందన్నారు. సాలూరు నియోజకవర్గంలో 7.25శాతం పెండింగ్ ఉందన్నారు. జిల్లాలో ఓటరు జాబితా పునశ్చరణ సంతృప్తికరంగా జరిగిందన్నారు. ఓటరు జాబితా నుండి 23 వేల ఓట్లు వరకు తొలగించవచ్చునన్నారు. సెప్టెంబర్ 29నుండి పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ జరుగుతుందని, ఒక పోలింగ్ కేంద్రంలో 1500 ఓట్లు మాత్రమే ఉండేటట్లు చర్యలు చేపడుతున్నామన్నారు. ఒక కుటుంబం, అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కుటుంబాలు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలుంటే తెలియజేస్తామన్నారు. సమావేశంలో డీఆర్ఓ జె.వెంకటరావు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్వాహణలేని బ్యాంకు ఖాతాదారులను గుర్తించాలి

పార్వతీపురం: గత పదేళ్లుగా నిర్వాహణ లేని వ్యక్తిగత బ్యాంకు ఖాతాలను గుర్తించి సంబంధికులకు అందులోని నగదును అందించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంకు ఖాతాల నిర్వాహణ, బ్యాంకుల లక్ష్యాలను, రుణాల మంజూరు తదితర అంశాలపై బ్యాంకర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా బుధవారం సమీక్షించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్వాహణ లేని బ్యాంకు ఖాతాల వివరాలను సంబంధిత వ్యక్తులకు చిరునామాతో వివరాలను అందజేయాలన్నారు. సీసీఆర్‌పీ కార్డు కలిగి వున్న పదివేల మంది రైతులు, కౌలు రైతులకు, డీపట్టా రైతులందరికీ వ్యవసాయ పంట రుణాలను శతశాతం మంజూరు చేయాలన్నారు. మత్స్యకారులకు, పశు పెంపకందార్లకు కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీచేయాలని, తద్వారా ప్రభుత్వం అందిస్తున్న రుణాలు మంజూరు చేయాలన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ జెఎల్ఎన్.మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలకు సంబంధించి రుణాలను మంజూరు చేయాలని, స్వయం సహాయక సంఘాలకు పశువుల యూనిట్లు ఏర్పాటుకు బ్యాంకర్లు ప్రోత్సాహమివ్వాలన్నారు. సమావేశంలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎల్‌డీఎల్ నాగప్రవీణ్, జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్, మత్స్యశాఖాధికారి వి.తిరుపతయ్య, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, టీపీఎంయూ ఏపీడీ వై.సత్యంనాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం తదితరులున్నారు.

జిల్లావాసికి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు



ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సుతో పీవీఆర్ రాజా

విజయనగరం టౌన్: ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన పీవీఆర్ రాజాకు స్థానం లభించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో రాజా తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన పీవీఆర్ రాజా విజయనగరంలో చదువుకుని హైదరాబాద్‌లో సుమారు 150కి పైగా లఘుచిత్రాలకు సంగీతాన్ని సమకూర్చారు. అనేక చిత్రాలకు పాటలు రచించారు. ఇప్పటివరకూ వెండితెరపై మూడు చిత్రాలకు సంగీతాన్ని సమకూర్చారు. ఈయన తండ్రి జిల్లాలో కానిస్టేబుల్‌గా పని చేసి పదవీ విరమణ చెందారు. పేద కుటుంబం నుంచి వచ్చి, ఎంతో పట్టుదలతో సంగీతాన్ని స్వయంకృషితో అభ్యసించి, నేడు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు. పంచభూతాలకు, సంగీతానికి గల అవినాభావ సంబంధాన్ని వివరిస్తూ ఒక పుస్తకాన్ని రాస్తున్నట్లు తెలిపారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకోవడం పట్ల కుటుంబ సభ్యులతో పాటూ, సంగీత కళాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

మురిపించిన విజయం

ఆంధ్రప్రదేశ్ శ్రీహరి కోట నుంచి ప్రయోగించిన చంద్రయాన్-3 విజయంతో విద్యార్థిలోకం ఉప్పొంగింది. ఊరంతా సంబరం జరుపుకుంది. జాతీయ పతాకాలను చేతబట్టి జయహో భారత్ అంటూ నినదించింది. ఇస్రో శాస్త్రవేత్తలపై అభినందనల వర్షం కురిపించింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏ వీధి, విద్యాలయంలో చూసినా చంద్రయాన్-3 విజయహాసమే కనిపించింది. ఉదయం నుంచి విద్యాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన టీవీలు, స్క్రీన్‌లపై వ్యోమనౌక గమనాన్ని విద్యార్థిలోకం వీక్షించింది. నమూనాలను ప్రదర్శించింది. అక్షర రూపంలో చంద్రయాన్-3 విజయాన్ని ఆకాంక్షించింది. వ్యోమనౌక సురక్షితంగా ల్యాండ్ అయిన వేళ.. కేరింతలు కొట్టింది. ఒకరికొకరు అభినందనలు తెలుపుకుంటూ.. చందమామ అందిందంటూ మురిసిపోయింది. చంద్రుడి దక్షిణ ధ్రువానికి వ్యోమనౌకను పంపించి తొలి విజయం అందుకున్న భారత కీర్తి విశ్వవ్యాప్తమైందంటూ మేధావి వర్గం ప్రశంసించింది.

– సాక్షినెట్‌వర్క్



రాజాం సిటీ: చంద్రయాన్-3 నమూనాతో కంచరాం పాఠశాల విద్యార్థులు



ఎస్.కోటలో విద్యార్థుల చంద్రయాన్-3 విజయోత్సాహం

కుళాయి వద్ద కొట్లాట

- 8 మందికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: తాగునీటి కోసం కుళాయి వద్ద రెండు కుటుంబాల మధ్య కొట్లాట చోటు చేసుకుంది. బుధవారం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. మండలంలోని ఎమ్మార్ నగరంలో మంగళవారం సాయంత్రం బాలరాజు ఇంటి ముందు రహదారిపై తాగునీటి కోసం కొట్లాట జరిగింది. బి.ధర్మారావు, బి.లక్ష్మి, ఉమాశంకర్, సాయి శంకరరావులు, టి.బాలరాజు, వినయ్‌కుమార్, ఎ.సంతోష్‌కుమార్, పి.శ్రావణ్‌కుమార్‌ల మధ్య తాగునీరు బిందెల్లో నీరు పట్టే విషయమై వాగ్వివాదం చోటు చేసుకొని కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో 8మందికి తలకు, చేతులకు పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.